# పిచ్చిదాని గోడు

"ఓసేయ్ పిచ్చిదానా...ఇదుగో నీ బాబు" అంటూ దూరంగా పరుగెత్తాడు ఒక కుర్రాడు.

"ఏడీ నా బాబు... బాబు ఎక్కడ?" అని ఆశగా చూచింది అవ్వ. పిల్లలమూక పకపకా నవ్వారు. అవ్వకు ఆవేశం వచ్చింది. జుట్టు పీక్కుని, చేయి గట్టిగా కొరుక్కుంది. అదే గుర్తు అల్లరి మూకకు. ఇక ఆ ప్రాంతంలోనే తిరుగుతారు. అయితే రఘు కదల్లేదు. అవ్వమీద ఎక్కడలేని జాలి జనించింది.

"ఎవరవ్వా బాబు?" అని ప్రశ్నించాడు. చేతిక్రరను నేలకు కొడుతూ, పిచ్చిగా నవ్వింది అవ్వ. రఘుకు ఏమీ అర్థం కాలేదు. మళ్లీ అడిగాడు.

"ఎవరవ్వా బాబు?" అని. ఈసారి అవ్వ ఎంతో దీనంగా చూచింది రఘువేపు. ఆ చూపుల్లో వెఱ్ఱితనం పుట్టి పడుతోంది. రఘు కంగారుపడి "ఎందుకలా చూస్తావ్?" అంటూనే అడుగులు వెనక్కు వేయసాగాడు. అవ్వ వింతగా నవ్వింది. "వట్టి పిచ్చిది" అనుకుంటూ పరుగు లంకించుకున్నాడు రఘు.

"ఏరా రఘు! ఎందుకలా పరుగెత్తుతున్నావ్" అన్నాడు మునలయ్య ఎదురు తగిలి.

"అఁ—ఏం లేదు తాతా... పిచ్చిది..."

"పిచ్చిది కాదు రఘూ. అమె ఒకనాడు మంచిదే...కాని మంచి జీవితం అనుభవించే అదృష్టవంతురాలు కాలేకపోయింది.

"ఎందుకని తాతా" అమాయకంగా అడిగాడు రఘు.

"అదంతా ఒక పెద్ద గాథ...విన దలచుకుంటే నాతో పొలం వచ్చేయి. చెప్తా" అని తాత అనడం తడవు రఘు చంక లెగరేశాడు వస్తానని. పిచ్చిదాని కథ వినాలని, రఘుకు ఎంతో ఉత్సాహం కలిగింది. తను విని, మిత్రబృందానికి చెప్పి, నవ్వించి, కవ్వించ వచ్చుననే పసితనపు సంబరంతో తాత వెంట నడక సాగించాడు రఘు.

"పది సంవత్సరాల క్రితం రైతు రామయ్యగారి కుటుంబం అష్టైశ్వర్యాలతో తులతూగుతూండేది. ఈ ఊళ్ళో చెప్పుకోదగిన ధనవంతుడు, ధర్మబుద్ధిగలవాడు, ఆరోజుల్లో రామయ్యఒక్కడే. తల్లి, తండ్రి చిన్నతనంలో చనిపోయినా, బాల్యదశలోవున్న తమ్ముణ్ణి, బహు గారాబంగా పెంచి పెద్ద జేశాడు. అయితే తమ్ముడు విశ్వాస ఘాతకుడుగా మారి, చివరకు రామయ్య వంశాన్నే నిర్మూలం గావించాడు. పరమ కిరాతకుడు" తాత ఆవేశంతో పళ్లు కొరికాడు.

"ఏం చేశాడేమిటి?" అని రఘు తాత ప్రక్కకి చేరాడు.

"పవిత్రమూర్తి, ఆదర్శసతి రామయ్యగారి భార్య యశోదాదేవి. ఆ దంపతుల ముద్దుబిడ్డడే నాగేంద్రబాబు. అల్లారు ముద్దుగా పెంచుతుండేవారు రామయ్యగారు. నాగేంద్రబాబును విడిచి ఒక్క క్షణమైనా ఉండేవారుకాదంటే ఆశ్చర్యంలేదు. నాగేంద్ర బాబు భావిజీవితంగురించి అనేక తియ్యని కలలు గన్నారు రామయ్య దంపతులు.

బాబుకు మూడుపళ్లు వచ్చినయి. రామయ్యగారు మంచమెక్కారు. బాబు పసిముఖాన్ని చూచి తీరనివ్యథతో కుమిలిపోయేవారు. ఆఆ వేదనవల్ల రోగం మరింత ముదిరిపోయి, రామయ్యగారిని తుది ఘడియలకు తెచ్చింది. కట్టుకున్న ఆకాశహార్మ్యలన్నీ కుప్పగా కూలిపోయినయ్. రామయ్యగారి హృదయంలో చీకటి - వెలుగులు కొంతకాలం పోరాటం సలిపాయి... కన్నుమూస్తూ అన్నారు తమ్ముడితో...

"తమ్ముడూ... నా గారాబు కొడుకు...నాగేంద్ర బాబును ఎట్లా సాకుతావో? భగవంతుని దృష్టిలో నాజీవితం సమాప్తమైంది. మానవాతీతుని ఆజ్ఞ మీరేందుకు మానవుని తరమా నాయనా?" అని

'సింహశ్రీ'

కన్నీరు కారుస్తూ కళ్లు మూశారు రామయ్యగారు."

"ఆతర్వాత ఏం జరిగింది తాతా?" అని ఏడుస్తూ అడిగాడు, కథలో లీనమై వింటున్న రఘు.

"క్రూరస్వభావుడు, దుష్టుడు అయిన రామయ్య తమ్ముడు...నిర్దయగా...తల్లి సమానురాలైన వదిన యశోదాదేవిని...నాగేంద్రబాబును ఇంటినుంచి తరిమివేశాడు" తాత ఒక్కక్షణం ఆగిపోయాడు.

"ఎందుకు తాతా?"

"అదే నాయనా మానవ జీవితంలో వున్న మహత్తర విషయం. తమ్మునికి దురాశ కలిగింది. అన్న ఆస్తి కాజేయాలనుకున్నాడు. ధనతృష్ణ కలవాడికి...కళ్ళకు పొరలు క్రమ్ముతాయ్ రఘూ! వాడికి ఏ చెట్టును చూచినా, ఏ పుట్టను చూచినా డబ్బు...డబ్బే తాండవమాడుతున్నట్టు భ్రమ కలుగుతుంది. హృదయం పాషాణం చేసుకుని ఆ దాహం తీర్చుకుంటాడు. మంచీ - చెడునూ...గౌరవ మర్యాదలను ఎంచుకోలేడు ... బాహ్య ప్రపంచమంతా అర్థం లేనిదిగా అవుపిస్తుంది.

ధనాకాంక్షతో తల్లి కొడుకులనుతీరనికష్టాలకు లోను చేశాడు. ఒక చిన్నతోటమాత్రం ఇవ్వాలని అతనికి ధర్మంగా తోచింది. అనుకున్న విధంగా ఆచరించాడు."

"అయితే నాగేంద్రబాబు బీద వాడైపోయాడన్న మాట పాపం!" అని గుడ్ల నీరు పెట్టుకున్నాడురఘు.

"ఔను రఘూ...అతి దుర్భర జీవితాన్ని గడిపారు మరి నాలుగేండ్లు. వస్తున్న వూటలున్నాయంటే అతిశయోక్తి కాదు. బంగారుసౌధంలో విహరించిన యశోదాదేవి, కడకు పూరి గుడిసెలో పడుకోవలసి వచ్చింది. పరమాన్నం తిన్న ఆ ఇల్లాలు కారవు మెతుకులుకూడ నోచుకోలేక పోయింది."

"ఎన్ని కష్టాలొచ్చాయి తాతా?"

"ఇంకా విను రఘూ. తమ్మునికి రానురాను ఒక భయ మేర్పడింది. బాబు పెద్దవాడై ఆస్తికోసం దావా జరుపుతాడనే ధృఢనమ్మకం తమ్ముని గుండెల్లో సూదై గ్రుచ్చుకుంది. దాంతో రాక్షసత్వం విజృంభించింది అతనిలో."

"ఏం చేశాడేం?" అలాగే నోరు తెరిచేశాడు రఘు.

"అది చక్కని వెన్నెలరాత్రి. పిల్లలంతా కేరింతలు కొడుతున్నారు చంద్రుని చూచి. బాబు కూడా వచ్చాడు ఆడుకోటానికి. తమ్ముడికి అది ఒక మంచి అవకాశంగా తోచింది బాబును హతమార్చేందుకు.

"బాబూ మిఠాయి!" అని పిలిచాడు. బాబు వెంటబడ్డాడు. తమ్ముడు పరుగుతీశాడు. అలా పరుగిడి...పరుగిడి ఒక బావిదాకా వెళ్లి ఆగిపోయాడు.

"కాకామిఠాయి" అని బాబు మరింత వేగంగా పరుగు తీశాడు. తమ్ముడు బావి చుట్టూ తిరిగాడు. మిఠాయి కోసం బాబుకూడ బావి చుట్టూ అల్లి బిల్లిగ తిరిగాడు."

"ఆ...తిరిగి"

"ఇంకేముంది రఘూ! తిరిగితిరిగి కళ్లు తిరిగి, బావిలోకి జారాడు"

"హాఁ" అని పెద్దగా అరిచాడు రఘు.

"ఔను రఘూ! ఎలాంటి వానికి ఏ గతి పట్టిందో చూశావా? దైవ సమానమైన భర్త గతించిపోయాడు. కడుపుకు తిండి కరువై పోయింది. బాబు అకాలమరణంతో యశోదాదేవి కడుపుకోతకు కుమిలి పోయింది. లోలోన నవ్వుకోవడం... జుట్టు పిరజోసుకోవడం మొదలైన పిచ్చి లక్షణాలు బయల్దేరినయ్... ఈ వెఱ్ఱి ప్రపంచాన్ని చూచి నవ్వుతుందామె. అమాయకులైన పసి పిల్లలను ప్రేమగా పలకరిస్తుంది... అంతలో మళ్లీ నవ్వుతుంది. ఆనవ్వు చాటున ఎంత విషాదం ఇమిడి వుందో ఎవరి కెరుక? అందాక ఎందుకు రఘూ నీకు తెలుసూ?" అని ప్రశ్నించాడు తాత.

"నాకేం తెలుసు తాతా"

"నిజమే! నీకేం తెలుస్తుంది. ఆ పతివ్రతామూర్తి యశోదాదేవే మన ఊళ్ళో పిచ్చిది రఘూ. ఆమెను చూచి అందరూ హేళన చేస్తారు. పిల్లలు రాళ్లు విసురుతారు. కాని అకళంకమైన ఆ మాతృమూర్తి హృదయానికి అవన్నీ గడ్డిపోచతో సమానం...ఇదీ రఘూ, పిచ్చిదాని కథ" అని ముగించాడు తాత. రఘు కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగినయ్.

"కథ బావుందా రఘూ" అన్నాడు తాత.

"బాగానే ఉంది తాతా...కాని అంతా ఏడుపే" అని ఇంటికి దారి తీశాడు. రఘు తన్మయత్వానికి ఆశ్చర్యపోతూ తాత అడుగువేయ సాగాడు వెంటవెంటనే. ★